## క్లుప్తంగా

### అంతరిక్ష పరిశోధనలపై స్ఫూర్తి నింపిన శాస్త్రవేత్త



హసన్‌బాద జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న విశ్రాంత శాస్త్రవేత్త

**రామచంద్రపురం రూరల్:** ఇస్రో విశ్రాంత శాస్త్రవేత్త యాళ్ల శివప్రసాద్ సోమవారం హసన్‌బాద జెడ్పీ హైస్కూల్ విద్యార్థుల్లో అంతరిక్ష పరిశోధనల అంశంపై స్ఫూర్తి నింపారు. పాఠశాల ప్రధానోపాధ్యాయిని పీఎస్‌బీఎస్‌కే సుందరి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో 8, 9, 10 తరగతి విద్యార్థులకు మోటివేషనల్ ప్రోగ్రాం నిర్వహించారు. అంతరిక్షంలో ఉపగ్రహాల ప్రయోగం, రాకెట్‌ల తయారీ, కక్ష్య విధానం, పరిశోధనలు, అంతరిక్ష పరిశోధనల్లో భారత దేశ పాత్ర, ఇండియన్ మిస్సైల్ మేన్ ఏపీజే అబ్దుల్ కలాం పాత్ర తదితర అంశాలపై విద్యార్థులకు ఆసక్తికరంగా వివరించారు. కార్యక్రమంలో దొంతంశెట్టి ఓం ప్రకాశ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### ఇంగ్లిష్ పరీక్షకు 194 మంది హాజరు

**రాయవరం:** రాయవరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం జరిగిన ఇంటర్ ప్రథమ సంవత్సరం ఇంగ్లిష్ పరీక్షకు 194 మంది విద్యార్థులు హాజరయ్యారు. పరీక్షా కేంద్రానికి 209 మంది విద్యార్థులను అలాట్ చేయగా, 15 మంది గైర్హాజరైనట్టు పరీక్షా కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ దారపు వీరవెంకట నాగేశ్వరరెడ్డి తెలిపారు.

### పల్స్‌పోలియో మాపింగ్ అప్ ప్రోగ్రాం



వెంటూరులో మాపింగ్ అప్ ప్రోగ్రాంలో పోలియో చుక్కలు వేస్తున్న వైద్య సిబ్బంది

**రాయవరం:** మండలంలోని రాయవరం, మాచవరం పీహెచ్‌సీల పరిధిలో సోమవారం మాపింగ్ అప్ ప్రోగ్రాం నిర్వహించారు. రాయవరం, మాచవరం పీహెచ్‌సీ వైద్యాధికారులు ఎం.శ్రీనివాస్, కె.మణికంఠ, అనిరుధ్, రమ్యశ్రీ ఆధ్వర్యంలో మాపింగ్ అప్ కార్యక్రమం చేపట్టారు. రాయవరం, మాచవరం పీహెచ్‌సీల పరిధిలో 4,985 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేయడం లక్ష్యం కాగా, సాయంత్రం ఆరు గంటలకు 4,841 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. మిగిలిన మూడు శాతం మందికి పోలియో చుక్కలు వేసే కార్యక్రమాన్ని కొనసాగించగా, మంగళవారం కూడా మాపింగ్ అప్ ప్రోగ్రాం నిర్వహించనున్నట్టు పీహెచ్‌సీ వైద్యాధికారులు తెలిపారు.

### సామాజికాంశాలపై అవగాహన అవసరం



వల్లూరు పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న మహిళా పోలీస్

**కపిలేశ్వరపురం:** విద్యార్థులకు సామాజికాంశాలపై అవగాహన అవసరమని వల్లూరు సచివాలయ మహిళా పోలీస్ గెడ్డం ప్రమీల అన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సోమవారం వల్లూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కలిగించారు. విద్యార్థినుల సంరక్షణ కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న రక్షణ చర్యలను వివరించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

### ఎస్ఆర్ రహదారికి మరమ్మతులు ప్రారంభం



సోమేశ్వరం రహదారికి చేపడుతున్న మరమ్మతులు

**రాయవరం:** సోమేశ్వరం–రాజానగరం ఆర్ అండ్‌బీ రహదారికి మరమ్మతు పనులను సోమవారం ప్రారంభించారు. సోమేశ్వరం నుంచి రాయవరం వరకు ఆర్అండ్‌బీ రహదారి పాడైన నేపథ్యంలో ఈ రోడ్డును అభివృద్ధి పర్చాలని వైఎస్సార్ సీపీ రాయవరం నేతలు ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులుకు విజ్ఞప్తి చేశారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్సీ త్రిమూర్తులు స్పందించి అత్యవసర మరమ్మతుల కింద నిధులు మంజూరు చేశారు. సోమేశ్వరం నుంచి లొల్ల వరకూ అత్యవసర నిధుల కింద రూ.4 లక్షలు మంజూరు కాగా, పనులు ప్రారంభించారు. రాయవరం–లొల్ల రహదారి మరమ్మతులకు రూ.50 లక్షలు మంజూరు కాగా, త్వరలోనే మరమ్మతులు పూర్తి చేస్తామని ఆర్అండ్‌బీ డీఈఈ టీవీఎస్ సూర్యనారాయణ తెలిపారు. రాయవరం–లొల్ల రహదారిని అభివృద్ధి చేయనుండడంపై రాయవరం, లొల్ల గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# పేదల సొంతింటి కల సాకారమే సీఎం లక్ష్యం

- ఎంపీ సుభాష్‌చంద్రబోస్, కోఆర్డినేటర్ సూర్యప్రకాష్
- కాజులూరు, వెంకటాయపాలెంలో ఇళ్ల పట్టాల పంపిణీ



కాజులూరులో లబ్ధిదారులకు ఇళ్ల స్థల పట్టాను పంపిణీ చేస్తున్న ఎంపీ పిల్లి సుభాష్‌చంద్రబోస్



వెంకటాయపాలెంలో లబ్ధిదారులకు ఇళ్ల రిజిస్ట్రేషన్ పత్రాలు అందజేస్తున్న రామచంద్రపురం కోఆర్డినేటర్ సూర్యప్రకాష్

**కాజులూరు:** పేదల సొంతింటి కల సాకారమే లక్ష్యంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని రాజ్యసభ సభ్యుడు (ఎంపీ) పిల్లి సుభాష్‌చంద్రబోస్ అన్నారు. 'నవరత్నాలు పేదలందరికీ ఇళ్లు' కార్యక్రమంలో భాగంగా సోమవారం కాజులూరులో 1434 మంది లబ్ధిదారులకు ఇంటి స్థల హక్కు పత్రాలను పంపిణీ చేశారు. ఎంపీపీ మాత భారతి అధ్యక్షతన జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ మనిషికి కనీస అవసరాలైన కట్టుకోవటానికి బట్ట, తినడానికి తిండి, ఉండటానికి ఇళ్లు, ఆరోగ్య భద్రత రాష్ట్రంలో ప్రతి పేదవాడు కలిగి ఉండాలన్నదే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఉద్దేశమన్నారు. ప్రజా సంకల్ప పాదయాత్ర ద్వారా పేదల కష్టాలు తెలుసుకున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని ఆదుకునేందుకు నవరత్నాలు పేరుతో పథకాలు రూపొందించారని ఇందులో భాగంగానే గూడులేని ప్రతి పేదవాడికి ఇళ్ల స్థలం అందించటానికి చర్యలు తీసుకోవటం జరిగిందన్నారు. గతంలో ఏ సీఎం చేయని విధంగా రాష్ట్రంలో అనేక సంక్షేమ పథకాలను తమ ప్రభుత్వం అములు చేసి పేదలకు బాసటగా నిలిచిందన్నారు. బృహత్తర పథకాలతో ప్రజామన్ననలు పొందిన జగనన్నను ఎదుర్కొనలేక ప్రతిపక్ష పార్టీలన్నీ ఏకమై మూకుమ్మడి దాడికి ప్రయత్నిస్తున్నాయని రానున్న ఎన్నికల్లో ఓటు అనే ఆయుధం ద్వారా ప్రజలే వారికి తగిన బుద్ధి చెప్పాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ వనుం వెంకట సుబ్బారావు, వైస్ ఎంపీపీ పెదిరెడ్డి వెంకటరమణ, సర్పంచ్ దండంగి సరోజిని, పార్టీ నాయకులు యాళ్ల సత్తిబాబు, కాదా నాగరాజు, పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

**పేదల సొంతింటి కలను నిజం చేసిన సీఎం**

**రామచంద్రపురం రూరల్:** పేదల సొంతింటి కలను నిజం చేసిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వారి జీవితాల్లో వెలుగులు నింపారని రామచంద్రపురం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాష్ అన్నారు. మండలంలోని వెంకటాయపాలెంలో నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు పథకంలో భాగంగా మహిళల పేరిట రిజిస్టర్ చేసిన రిజిస్ట్రేషన్ పత్రాలను సూర్యప్రకాష్ చేతుల మీదుగా సోమవారం పంపిణీ చేశారు. సూర్యప్రకాష్ మాట్లాడుతూ ప్రజల సంక్షేమానికి పెద్దపీట వేసి పాలన అందించిన సీఎంని మళ్లీ గెలిపించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. సర్పంచ్ యల్లమిల్లి సతీష్‌కుమారి, ఎంపీపీ అంబటి భవాని, ఏపీఐడీసీ డైరెక్టర్ వాసంశెట్టి శ్యామ్ తదితరులు మాట్లాడుతూ అక్కచెల్లెమ్మలకు ఆస్తిగా భరోసా ఇస్తూ ఇళ్ల స్థలాలు ఇవ్వడమే కాకుండా ఇంటి నిర్మాణాలకు సహకరిస్తూ అందరూ పక్కా ఇళ్లు నిర్మించుకునేందుకు సహకరించిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని మళ్లీ ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు ఇంత సంతోషం, సర్పంచ్‌లు కొత్తపల్లి అరుణ, అంబటి తుకారం, అనిశెట్టి రామకృష్ణ, ఎంపీటీసీలు బళ్ల సుధాకరరావు, పంపన ఏడుకొండలు, నురుకుర్తి శ్రీరామకృష్ణ, తహశీల్దార్ మైలా వెంకటేశ్వరరావు, ఎంపీడీఓ ఎన్‌వీ రామచంద్రమూర్తి, హౌసింగ్, రెవెన్యూ సిబ్బంది, వైఎస్సార్ సీపీ శ్రేణులు పాల్గొన్నారు.

## హామీలన్నీ నెరవేర్చిన ఘనత వైఎస్సార్ సీపీదే..

పసలపూడిలో గడప గడపకూ మన ప్రభుత్వం



పసలపూడిలో పథకాలను వివరిస్తున్న యువనేత పృథ్వీరాజ్ తదితరులు

**రాయవరం:** ఎన్నికలకు ముందు సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలు 99 శాతం నెరవేర్చారని వైఎస్సార్ సీపీ యువనేత తోట పృథ్వీరాజ్ అన్నారు. పసలపూడిలో సోమవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా యువనేత పృథ్వీరాజ్ మాట్లాడుతూ రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పారదర్శకమైన పాలన అందిస్తోందని, పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్న ఏకైన ప్రభుత్వమన్నారు. ప్రజలకు ప్రభుత్వం చేసిన మంచిని వివరించడానికే గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ప్రజలకు ప్రభుత్వం చేసిన మంచిని గుర్తించి, మరోసారి సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదించాలని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు. నాలుగున్నరేళ్లలో ప్రభుత్వం చేసిన అభివృద్ధి, చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలతో కూడిన కరపత్రాలను ఇంటింటికీ వెళ్లి అందజేశారు. పృథ్వీరాజ్ వెంట సర్పంచ్ కడలి పద్మావతి, ఉప సర్పంచ్ పోతంశెట్టి సాయిరామ్మోహన్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ సిరిపురపు శ్రీనివాసరావు, జెడ్పీటీసీ నల్లమిల్లి మంగతాయారు, ఎంపీపీ నౌడు వెంకటరమణ, ఎంపీటీసీ కర్రి విజేత, పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు చింతా సుబ్బారెడ్డి, పారిశ్రామికవేత్తలు చింతా వెంకటరెడ్డి, చైతన్య రాజబాబు, సొసైటీ అధ్యక్షుడు చింతా రామ్మోహన్‌రెడ్డి, మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు ఆరిఫ్, నాయకులు నల్లమిల్లి వెంకటరెడ్డి, పోతంశెట్టి సత్యనారాయణరెడ్డి, మండల సోషల్ మీడియా కన్వీనర్ తవిటికి రత్నకుమార్, కోకన్వీనర్ చింతా సురేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## తుది దశకు ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ



కేదారిలంకలో ఆరోగ్యశ్రీ కార్డును అందజేస్తున్న సర్పంచ్ వీధి వెంకటరెడ్డి, సిబ్బంది

**కపిలేశ్వరపురం:** సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పేదల ఆరోగ్య పరిరక్షణకు అత్యధిక ప్రాధాన్యమిస్తోంది. ఈ నేపథ్యంలో ఆరోగ్యశ్రీ కార్డుల వినియోగ పరిమితిని పెంచింది. దీంతో పాత కార్డుల స్థానంలో నూతనంగా పూర్తి వివరాలతో కార్డులను సిద్ధం చేసింది. కార్డులను క్షేత్ర స్థాయిలో లబ్ధిదారులకు వైద్య, ఆరోగ్య సిబ్బంది పంపిణీ చేస్తున్నారు. ఎంపీడీఓ కొండలరావు పర్యవేక్షణలో మండలంలో కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని సిబ్బంది వేగవంతం చేశారు. అంగర–1 సచివాలయ పరిధిలో 1,496కు 1,120 కార్డులను లబ్ధిదారులకు అందజేశారు. అంగర–2లో 1,588కు 1,274, వల్లూరులో 1,413కు 1,089, కోరుమిల్లి–1లో 1,239కు 983, కోరుమిల్లి–2లో 699కు 629, మాచరలో 1,312కు 1,061, కపిలేశ్వరపురం–1లో 1,280కు 1,016, కపిలేశ్వరపురం–1లో 1,232కు 1,007, నేలటూరులో 1,246కు 1,027, తాతపూడిలో 838కు 617, అద్దంకివారిలంకలో 792కు 638, కేదారిలంకలో 1,215కు 1,044, నల్లూరులో 909కు 736, టేకి–1లో 1,094కు 885, టేకి–2లో 1,184కు 921, వాకతిప్పలో 895కు 766, కాలేరులో 1,290కు 1,123, వెదురుమూడిలో 863కు 714, పడమర ఖండ్రికలో 1,243కు 990, వడ్లమూరులో 1,132కు 872 కార్డులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు.

## ఓటును ప్రాథమిక హక్కుగా భావించాలి



టేకిలో అవగాహన కల్పిస్తున్న ఎస్సై పరదేశి

**కపిలేశ్వరపురం:** ప్రతిఒక్కరూ ఓటును ప్రాథమిక హక్కుగా భావించి, వినియోగించుకోవాలని అంగర ఎస్సై అందే పరదేశి అన్నారు. టేకిలో సర్పంచ్ కుక్కల నాగమణి అధ్యక్షతన ఎన్నికల నిబంధనలు, శాంతి భద్రతల అంశాలపై అవగాహన కల్పించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎన్నికల నిర్వహణ తీరును వివరించారు. అంగర పోలీస్ స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో గత ఎన్నికల్లో జరిగిన పరిణామాలను అనుభవాలుగా తీసుకుని గ్రామస్తులు రానున్న ఎన్నికల్లో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎన్నికలకు సంబంధించిన చట్టాలను వివరించారు. కార్యక్రమంలో మాజీ పీఏసీఎస్ చైర్మన్ మట్టపర్తి పాల్‌రాజ్, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, వైఎస్సార్ సీపీ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఏపీఎస్ఆర్టీసీలో అద్దె బస్సులకు టెండర్ల ఆహ్వానం

**రామచంద్రపురం రూరల్:** రామచంద్రపురం మీదుగా రావులపాలెం నుంచి కాకినాడకు, అదే విధంగా రావులపాలెం నుంచి సామర్లకోటకు వెళ్లే రూట్లలో తిప్పడానికి అద్దె బస్సుల కోసం టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు రామచంద్రపురం డిపో మేనేజర్ కొడమంచిలి వెంకటేశ్వర్లు సోమవారం విలేకరులకు తెలిపారు. ఆసక్తి కలిగిన వారు ఈ నెల 6 సాయంత్రం 5 గంటల్లోపు ఏపీఎస్ఆర్టీసీ వెబ్‌సైట్‌లో ఈ టెండర్లు దాఖలు చేయాలని సూచించారు.

## ఘనంగా జాతీయ లైన్‌మన్ దినోత్సవం



లైన్‌మన్ల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించుకుంటున్న ఏపీఈపీడీసీఎల్ అధికారులు

**రామచంద్రపురం:** పట్టణంలోని ప్రసన్న విఘ్నేశ్వర ఫంక్షన్ హాలులో ఏపీఈపీడీసీఎల్ రామచంద్రపురం డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వై.విజయానంద్ ఆధ్వర్యంలో సోమవారం జాతీయ లైన్‌మన్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రజల జీవితాల్లో ముఖ్య భూమిక పోషిస్తూ వారి కోసం 24 గంటలూ పనిచేసే లైన్‌మన్‌ల కోసం ఒక రోజును ప్రత్యేకంగా జరుపుకోవడం సంతోషకరమైన విషయమని పేర్కొన్నారు. లైన్‌మన్లు పని ఒత్తిడిని జయిస్తూ ప్రమాదాల బారిన పడకుండా ప్రశాంతంగా విధులు నిర్వహించాలని ఆకాంక్షను వెలిబుచ్చారు. అనంతరం లైన్‌మన్లను ఆయన దుశ్శాలువాలు, పూల దండలతో సత్కరించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు కె.మురళీమోహన్, శ్రీధర్, ఏఈ మేడిశెట్టి వెంకటరమణ, డివిజన్ పరిధిలోని లైన్‌మన్లు పాల్గొన్నారు.

## ఆస్పత్రికి వెళ్లి.. పింఛన్ అందించి



చెల్లూరులో చికిత్స పొందుతున్న రాఘవకు పింఛను అందిస్తున్న వలంటీర్ సత్యవేణి



కాకినాడలో చికిత్స పొందుతున్న కృష్ణమూర్తికి పింఛను అందిస్తున్న వలంటీర్ దేవి

**కె.గంగవరం:** మండలంలోని కుందూరు, అద్దంపల్లి గ్రామాలకు చెందిన వలంటీర్లు పింఛను పంపిణీ ప్రక్రియలో తమకు అప్పగించిన కుటుంబాలకు మేలు చేసి ఔదార్యం కనబరిచారు. అద్దంపల్లి వలంటీర్ చల్లా సత్యవేణి ఇదే గ్రామానికి చెందిన వాస వీర రాఘవ చెల్లూరులోని ఆసుపత్రిలో చికిత్స పొందుతుంది. ఆమె వద్దకు వెళ్లి వలంటీర్ పింఛను పంపిణీ చేసింది. దీంతో గ్రామ సర్పంచ్ లక్ష్మి, వైస్ ఎంపీపీ దూడల చినబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు చింతపల్లి వాసు తదితరులు అభినందించారు. దీంతో పాటు కుందూరు గ్రామానికి చెందిన పెంకే కృష్ణమూర్తి కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రిలో అనారోగ్యంతో చికిత్స పొందుతున్నాడు. దీంతో ఆ కుటుంబానికి చెందిన వలంటీర్ కట్టా లలితా దేవి కాకినాడ వెళ్లి వృద్ధుడికి పింఛను అందించింది.

## వలంటీర్ల సేవలు విలువైనవి

ఎంపీపీ వెంకటరమణ



వి.సావరంలో వలంటీర్‌ను సత్కరిస్తున్న ఎంపీపీ వెంకటరమణ తదితరులు

**రాయవరం:** ప్రజలకు వలంటీర్లు అందిస్తున్న సేవలు వెలకట్టలేనివని రాయవరం ఎంపీపీ నౌడు వెంకటరమణ అన్నారు. వి.సావరంలో సోమవారం వలంటీర్లను సత్కరించారు. సర్పంచ్ కాకి కృష్ణవేణి, ఉప సర్పంచ్ వెలగల సత్యనారాయణరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీపీ వెంకటరమణ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజలకు సత్వరంగా సేవలు అందించేందుకు వలంటీర్ల వ్యవస్థను ప్రవేశ పెట్టిందన్నారు. వలంటీర్ వ్యవస్థ కారణంగా ప్రజలకు వేగవంతంగా సేవలు అందుతున్నాయన్నారు. అనంతరం ఉప సర్పంచ్ వెలగల సత్యనారాయణరెడ్డి సౌజన్యంతో వలంటీర్లను సత్కరించి, వారికి చీర, స్వీట్ బాక్స్ అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మేడిశెట్టి నాగమణి, సొసైటీ త్రిసభ్య కమిటీ చైర్మన్ సిరికి కృష్ణారావు, వైఎస్సార్ సీపీ గ్రామ శాఖ అధ్యక్షుడు గుత్తుల సత్యనారాయణ, ఎంఎల్‌ఓ రాజేష్, వార్డు సభ్యులు పంపన గోవిందు, బంగారు గోవిందు, మండ హరనాథరెడ్డి, పంపన ప్రకాష్, పార్టీ నేత కాకి కోటేశ్వరరావు, మేడిశెట్టి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## కడలి వంశీయుల ఆత్మీయ కలయిక



మల్లవరంలో కలసిన కడలి వంశీయులు

**కె.గంగవరం:** మండలంలోని కూళ్ల శివారు కూళ్లమల్లవరంలో కడలి వంశీయులందరూ ఆత్మీయ కలయిక నిర్వహించారు. కూళ్లమల్లవరానికి చెందిన కడలి వంశీయుల వివిధ ఉద్యోగాలు, వ్యాపారాల్లో స్థిరపడి వివిధ గ్రామాలకు వలస వెళ్లిపోయారు. వారందరూ ఏటా మల్లవరం వద్ద ఆత్మీయంగా కలసి సత్తెమ్మ తల్లి జాతరను నిర్వహించుకుంటారు. ఈ ఏడాది కూడా వారందరూ కలసి ఘనంగా సత్తెమ్మ జాతర నిర్వహించి వారి శ్రేయోభిలాషులు, బంధువులు, స్నేహితులను పిలిచి సహపంక్తి భోజనాలు చేశారు. రోజంగా ఉల్లాసంగా గడిపి వారివారి గ్రామాలకు వెళ్లిపోయారు.

## బైక్ దొంగలున్నారు జాగ్రత్త..!

రెండు రోజుల్లో నాలుగు మోటార్ సైకిళ్ల చోరీ

**రాయవరం:** మోటార్ సైకిళ్ల దొంగలు రాయవరంలో హల్‌చల్ చేస్తున్నారు. మోటార్ సైకిళ్లు టార్గెట్‌గా చేసుకుని దొంగలు తమ చేతివాటం ప్రదర్శిస్తుండడంతో వాహనదారులు బెంబేలెత్తుతున్నారు. గత రెండు రోజుల్లో నాలుగు మోటార్ సైకిళ్లు చోరీకి గురైనట్టు స్థానికులు చెబుతున్నారు. ఆస్పత్రులు, జన సమ్మర్దం ఉన్న ప్రాంతాలను టార్గెట్‌గా చేసుకుని, దొంగలు చెలరేగిపోతున్నారు. స్థానిక కేవీఆర్ ఆస్పత్రి ఎదురుగా ఇంటి వద్ద తాళం వేసి పెట్టిన కొత్త పల్సర్ బైక్‌ను శనివారం రాత్రి దొంగలు తస్కరించారు. చైనాబజార్ వద్ద పెట్టిన మోటార్ సైకిల్‌ను ఇదే తరహాలో చోరీ చేశారు. చోరీ జరిగిన ప్రాంతంలో సీసీ కెమెరాను పరిశీలించగా, మాస్కులు పెట్టుకుని, చోరీకి పాల్పడడంతో దొంగలను గుర్తించడం కష్టంగా మారింది. మార్నింగ్ వాక్‌కు వెళ్లిన వ్యక్తి మోటార్ సైకిల్ కూడా ఇదే తరహాలో చోరీకి గురైంది. ఇంటి బయట పెట్టిన స్కూటీని కూడా చోరీ చేయడంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సాధారణంగా రాత్రి సమయాల్లో ఇంటి బయట మోటార్ సైకిళ్లు పార్కింగ్ చేస్తారు. ఇటీవల జరుగుతున్న చోరీలతో మోటార్ సైకిళ్ల యజమానులు ఆందోళనకు గురవుతున్నారు. దీనిపై ఎస్సై జి.నరేష్‌ను వివరణ కోరగా, చోరీలపై ఎటువంటి ఫిర్యాదులు అందలేదన్నారు. రాత్రి సమయాల్లో నిఘాను పెంచామన్నారు.

### వైఎస్సార్ పార్క్ ఆధునీకరణ



మండపేట వైఎస్సార్ పార్క్‌లో చిన్నారుల సందడి

**కపిలేశ్వరపురం (మండపేట):** పట్టణంలోని పార్కుల అభివృద్ధికి మున్సిపల్ పాలకవర్గం, అధికారులు ప్రాధాన్యమిస్తున్నారు. పట్టణాభివృద్ధిలో భాగంగా డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి మెమోరియల్ మున్సిపల్ పార్క్ నడకదారిని టైల్స్‌తో మెరుగుపరుస్తున్నారు. చిన్నారులు ఆడుకునేందుకు జారుడుబల్ల, ఇతర ఆట పరికరాలను అమర్చారు. సాయంత్రం వేళ సందర్శించే వారి సంఖ్య గణనీయంగా పెరిగింది.

### ఏకగ్రీవంగా మండల దళిత యూత్ అసోసియేషన్ ఎన్నిక



సంఘ అభివృద్ధికి కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేస్తున్న నూతన కార్యవర్గం

**కాజులూరు:** కాజులూరులో అంబేడ్కర్ భవన్‌లో సోమవారం జరిగిన మండల దళిత యూత్ అసోసియేషన్ ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. సంఘం అధ్యక్షుడుగా మాత వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షుడిగా బీర సతీష్‌చంద్ర, జనరల్ సెక్రటరీగా పోతు శ్రీనివాస్, సెక్రటరీగా మాత నూకరావు, జాయింట్ సెక్రటరీగా పోతుల గనిరాజు, ఆర్గనైజింగ్ సెక్రటరీగా జల్లి సత్యనారాయణ, కోశాధికారిగా మాసాబత్తుల గోపాలరావులు ఏకగ్రీవంగా ఎన్నిక కాగా వినకోటి దమ్మప్రసాద్, ముదుకు శ్రీనివాస్, పోతురాజు రాంప్రసాద్, మాగం గణపతి తదితరులు కార్యవర్గ సభ్యులుగా ఎన్నికయ్యారు. సంఘ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తామని నాయకులు, సభ్యులు ప్రతిజ్ఞ చేశారు.

### ప్రశాంత్ కిశోర్ వ్యాఖ్యలు అర్థరహితం

**కపిలేశ్వరపురం (మండపేట):** రానున్న ఎన్నికల్లో సంక్షేమానికి ఓటేయరంటూ బీహార్‌కు చెందిన ప్రశాంత్ కిశోర్ వ్యాఖ్యానించడాన్ని ఏడిద సర్పంచ్ బూరిగ ఆశీర్వాదం సోమవారం విలేకరుల సమావేశంలో తప్పుబట్టారు. ప్రశాంత్ కిశోర్ ప్రస్తుతం ఆంధ్ర ప్రదేశ్‌లో ఎలాంటి సర్వే బృందాలను నిర్వహించడం లేనప్పుడు ఎవరు గెలుస్తారో ఎలా చెప్పగలరని ప్రశ్నించారు. సంక్షేమానికి ఓటు వేయరంటున్న ప్రశాంత్ కిశోర్ తన సొంత రాష్ట్రమైన బీహార్‌లో ఓడిపోయారన్న విషయాన్ని గుర్తు చేసుకోవాలన్నారు. ప్రతి ఇంటికీ ప్రభుత్వ లబ్ధిని చేకూర్చిన సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వమే రానున్న ఎన్నికల్లో అధికారంలోకి రానున్నదని ధీమా వ్యక్తం చేశారు.

### డ్వాక్రా యానిమేటర్లను తొలగించాలి

**రామచంద్రపురం:** నిబంధనలకు విరుద్ధంగా పనిచేస్తున్న డ్వాక్రా యానిమేటర్లను తొలగించాలని కోరుతూ మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు, జిల్లా మహిళా సమాఖ్య ఉపాధ్యక్షురాలు వాసంశెట్టి లావణ్య సోమవారం ఆర్డీఓ కార్యాలయంలో స్పందనలో ఫిర్యాదు చేశారు. గతంలో 2022 ఫిబ్రవరి 22న వెంకటాయపాలెం మహానేత మహిళా శక్తి సంఘం అధ్యక్షురాలు కొప్పిశెట్టి శ్రీలక్ష్మి జిల్లా కలెక్టర్‌కు స్పందనలో ఫిర్యాదు చేసిన ప్రకారం గ్రామ మహిళా సమాఖ్య సంఘ యానిమేటర్లు గరిష్ట కాల పరిమితి మూడు సంవత్సరాలని, గరిష్ట వయస్సు 40 సంవత్సరాలు అని, ఏ గ్రామాల వారు ఆ గ్రామాల్లోనే పనిచేయాలని కానీ కొందరు తమ గ్రామాలు కాకుండా మరో గ్రామాల్లో పనిచేస్తున్నారని ఇలా నిబంధనలు మీరి పనిచేస్తున్న వారిని తొలగించాలని కోరుతూ స్పందనలో ఫిర్యాదు చేసినట్లు లావణ్య విలేకరులకు తెలిపారు.

### నేడు ఎన్నికల నిర్వహణపై సమావేశం

**కపిలేశ్వరపురం (మండపేట):** రానున్న ఎన్నికల నిర్వహణపై మండపేట తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం ఉదయం 11.30కు రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించనున్నట్టు ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ మెహర్‌బాబా సోమవారం తెలిపారు. సమావేశంలో నియోజవకర్గ ఓటు నమోదు అధికారి, నియోజకవర్గంలోని తహసీల్దార్లు, రాజకీయ పార్టీల ప్రతినిధులు హాజరవుతారని చెప్పారు.

### నేడు వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణం

**రామచంద్రపురం రూరల్:** మండలంలోని ద్రాక్షారామలో దక్షగుండం వద్ద వేంచేసిన మాతా గోవిందమాంబ సమేత శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి దివ్య కల్యాణం నేటి రాత్రి 8.15 గంటలకు నిర్వహించనున్నట్లు కామాక్షి విశ్వబ్రాహ్మణ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కొసనా భీమశంకరం సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

### ఎమ్మెల్యే పర్యటన

**కపిలేశ్వరపురం (మండపేట):** ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు సోమవారం పట్టణంలో పర్యటించారు. టీడీపీ పట్టణ నాయకులతో కలిసి 2, 3, 21 వార్డుల్లో పార్టీ విధానాలను వివరించారు.

### యువకుడి మృతి

**మామిడికుదురు:** నగరం మల్లాయిపాలెంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన పెదపట్నం గ్రామానికి చెందిన రాయుడు దుర్గాప్రసాద్ (19) సోమవారం మృతి చెందాడని నగరం ఎస్సై పి.సురేష్ తెలిపారు. నగరం మల్లాయిపాలెం వద్ద ఆదివారం రాత్రి పల్సర్‌పై వస్తుండగా బొలెరో వాహనం అతడ్ని ఢీ కొట్టిందన్నారు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన దుర్గాప్రసాద్‌ను మొదట రాజోలు ప్రభుత్వాస్పత్రికి తరలించారని ఎస్సై తెలిపారు. అతడి ఆరోగ్య పరిస్థితి విషమించడంతో అక్కడి నుంచి కాకినాడ జీజీహెచ్‌కు తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ దుర్గాప్రసాద్ మృతి చెందాడన్నారు.